క్లుప్తంగా

విద్యాభివృద్ధికి పాటుపడాలి



స్కూల్ కాంప్లెక్స్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ-2 శ్రీనివాసరావు

బలిజిపేట: విద్యాభివృద్ధికి అందరు ఉపాధ్యాయులు పాటుపడాలని ఎంఈఓ-2శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు బలిజిపేట స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలలో విద్యాభివృద్ధి జరగాలని, వెనుకబడిన విద్యార్థులకు మంచి విద్యను బోధించి వారిని మెరుగుపరచాలని చెప్పారు. ఉపాధ్యాయులు పొందుతున్న శిక్షణతో విద్యార్థులలో సామర్థ్యాలను పెంచాలని పిలుపునిచ్చారు. మంచి విద్యను అందిస్తే విద్యార్థుల భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం

పార్వతీపురంటౌన్: మున్సిపాల్టీ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి. సింహాచలం తెలిపారు. ఈ మేరకు మంగళవారం బుడా నిధులతో పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో గల చర్చి వీధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు మెయిన్ రోడ్డు డ్రైన్ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించి వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను గుర్తిస్తూ పూర్తి చేస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మక్కువలో వలంటీర్లకు సత్కారం

మక్కువ: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం వలంటీర్లకు సత్కారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.దేవకుమార్ తెలిపారు. ఉదయం 10గంటలకు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చేతుల మీదుగా సత్కారం జరుగునున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని భక్తులు భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలను మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని ప్రసిద్ధ దేవాలయాలైన సత్యనారాయణ స్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి, వైకెఎం కాలనీ రామాలయాం, మండలంలోని సంగంవలస రామాలయాల్లో భక్తులు వేకువ జామునుంచే స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అనారోగ్యంతో గిరిజన బాలిక మృతి

పాచిపెంట: అనారోగ్యంతో గిరిజన బాలిక మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ,మండలంలోని కొండమోసూరు గ్రామానికి చెందిన పి.అనిత సరాయివలస పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. ఇటీవల బాలిక పుష్పవతి కావడంతో ఇంటికి తీసుకువెళ్లారు. కాగా ఇంటి వద్ద ఆమె అనారోగ్యానికి గురవడంతో ఈ నెల 17న గురివినాయుడుపేట పీహెచ్‌సికు తరలించారు. అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

విద్యతోనే సమాజాభివృద్ధి

సాలూరు: విద్యను ఆయుధంగా చేసుకుని పేదరికపు చీకట్లు నుంచి అభివృద్ధి వెలుగుల వైపు బాటలు వేసుకోవాలని సీఐ జి.దేముడు బాబు తెలిపారు. పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగే క్రమంలో లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు పాఠశాలల్లో మంచి విద్యతో పాటు అన్ని వసతులు, సౌకర్యాలు అందుతున్నాయన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో మెలుగుతూ గొప్ప స్థాయికి ఎదగాలని తెలిపారు. సీఐ జిడి.బాబును ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది గణపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమంటే ఇదే..!



నాడు-నేడు పనులతో ఆధునికీకరించిన పాఠశాల



గ్రామంలో జలజీవన్ మిషన్

- బలిజిపేట పరిధిలో రూ.2కోట్లతో పనులు
- సంక్షేమ పథకాలతో ప్రజలకు రూ.25కోట్ల లబ్ధి

బలిజిపేట: అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రంలో గ్రామస్వరాజ్యానికి అడుగులు పడ్డాయని చెప్పవచ్చు. అందుకు తార్కాణంగా బలిజిపేట మండల కేంద్రంలో రూ.2.70కోట్లతో అభివృద్ధి పనులు జరగ్గా, ప్రజలకు రూ.25కోట్ల వరకు సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరింది. గత ప్రభుత్వం హయాంలో అభివృద్ధి, సంక్షేమం కోసం వెంపర్లాడిన ప్రజలకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత తలుపుతట్టి సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్లు, వీధికాలువలు, కల్వర్టులు, చెరువుల సుందరీకరణ, మంచినీటి చెరువుల మరమ్మతులు, మంచినీటి ట్యాంకుల నిర్మాణం, జలజీవన్ మిషన్‌ద్వారా ఇంటింటికి కుళాయి పథకం వంటి అభివృద్ధి పనులు సమృద్ధిగా జరుగుతున్నాయి.



అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోంది. దళారీతనం, నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేయకుండా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతున్నాయి. ఇంతకన్నా ప్రజలకు ఇంకేం కావాలి.

– బి.రాఘలత, సర్పంచ్, బలిజిపేట

బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం



జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం అమలవుతోంది. గత ప్రభుత్వం కంటే అభివృద్ధి ఎక్కువగా కళ్లముందు కనిపిస్తోంది.

– వి.సాయిరాం, మండల ఉపాధ్యక్షుడు, బలిజిపేట

గ్రామ జనాభా	2,400	
రేషన్‌కార్డులు	681	
పథకాల రూపంలో నగదు బదిలీ		
పథకం	లబ్ధిదారులు	నగదు రూపాయలు
అమ్మఒడి	417	1.97లక్షలు
జగనన్న విద్యాదీవెన	320	8,81లక్షలు
జగనన్న వసతి దీవెన	245	38.34లక్షలు
రైతు భరోసా	345	1.31కోట్లు
సున్నా వడ్డీ	85	2.03లక్షలు
పంట రుణాలపై		
వైఎస్సార్ పెన్షన్ కానుక	684	6.33కోట్లు
వైఎస్సార్ చేయూత	355	1.61కోట్లు
వైఎస్సార్ ఆసరా	857	2.84కోట్లు
డ్వాక్రా సున్నా వడ్డీ	968	18.18లక్షలు
వైఎస్సార్ కాపు నేస్తం	21	8.85లక్షలు
ఇళ్లు	135	1.70కోట్లు
వాహనమిత్ర	11	2.60లక్షలు
వైఎస్సార్ బీమా	13	14.20లక్షలు
ఈబీసీ నేస్తం	8	2.10లక్షలు
వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా	2	1.50లక్షలు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	148	59.62లక్షలు
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	93	6.33లక్షలు
జగనన్న చేదోడు	62	10.00లక్షలు
ప్రత్యేక కోవిడ్ సహాయం	1,030	10.30లక్షలు
జగనన్న తోడు	49	23.96వేలు



గ్రామంలో వేసిన రోడ్డు



బలిజిపేట సచివాలయం



రైతు భరోసా కేంద్రం

సీఎం సహాయనిధి అందజేత



రామ్ మాస్టర్‌కు చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గ్రామానికి చెందిన చిల్లా రామ్‌రోషన్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి మంజూరైన రూ.40వేల చెక్కును ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం ఉదయం లబ్ధిదారుకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ లచ్చయ్యపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు వీధుల్లోకి వెళ్లిన సమయంలో చిల్లా రామ్‌రోషన్ తనను కలిసి వైద్యసహాయాన్ని అందించాలని కోరారని చెప్పారు. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేయాలని కోరడంతో తక్షణమే స్పందించిన ప్రభుత్వం రూ.40వేలు మంజూరు చేస్తూ చెక్కును అందజేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.వెంకంపేట సచివాలయ కన్వీనరు పి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ ఎ. సింహాచలం పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పులు సవరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

బలిజిపేట: రీ సర్వేలో దొర్లిన తప్పులను సరిచేయాలని అధికారులను సభ్యులు కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలపై రివ్యూ చేశారు. అందులో భాగంగా రెవెన్యూశాఖ రివ్యూ నిర్వహించేటప్పుడు సభ్యులు రీ సర్వే సక్రమంగా నిర్వహించలేదని, ఇష్టానుసారం చేశారని, ప్రస్తుతం వన్‌బీలు ఒకరి పేరున బదులు మరొకరి పేరున వస్తున్నాయని వాటిని సరిచేయాలని అధికారులపై అసహనం వెళ్లగక్కారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వేను నిర్వహించాలని సూచిస్తే సర్వేకి వచ్చే బృందం ఇష్టానుసారం చేయడంతో రైతులంతా నష్టపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. రీ సర్వేకి వచ్చేవారు గ్రామంలో నాయకులు, పెద్దలను సంప్రదించి వారిని తీసుకువెళ్లి సర్వే నిర్వహిస్తే ఇటువంటి పొరపాట్లు రావన్నారు. ఈ తప్పులను తక్షణమే సవరించాలని కోరారు. అదేవిధంగా నూకలవాడకు బస్సు పునరుద్ధరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, ఎంపీడీఓ రమేష్‌నాయుడు, ఏఓ భానుమూర్తి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల పరిశీలన

సాలూరు రూరల్ : మండలంలోని కరాసువలస కేజీబీవీ పాఠశాలను డీఈఓ జి.పగడాలమ్మ మంగళవారం పరిశీలించారు. పాఠశాల విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండడంతో వారికి పలు సలహాలు ఇచ్చారు. శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలని సూచించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. నాడు – నేడులో జరుగుతున్న పాఠశాల భవనాలను పరిశీలించారు. ఆమె వెంట ఎంఈఓ ఉన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లుతో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, ఎంపీపీ ప్రమీల తదితరులు

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పాచిపెంట: వలంటీర్ల సేవలు అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఎంపీపీ బడ్నాన ప్రమీల అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వలంటీర్లుకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వలంటీర్లను దుశ్శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సేవాభావంతో నిబద్ధతగా వలంటీర్లు పని చేస్తున్నారని అన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా అవినీతి రహితంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. సేవామిత్ర, వజ్ర, రత్న అవార్డులతో మీ సేవలను అభినందిస్తున్నామని అన్నారు. పాచిపెంట మండలంలో రూ.400 కోట్లతో వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని వివరించారు. రానున్న ఎన్నికల్లో అఖండ మెజారిటీతో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి కొనసాగేలా అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కొరిపల్లి రవీంద్రనాథ్, మీసాల నారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు టి.గౌరిశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: రానున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని 20వ పోలింగ్ బూత్ పరిధిలో గల 23, 24 వార్డుల బూత్ కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన వచ్చే ఎన్నికల్లో బూత్‌కమిటీ సభ్యులు ఏవిధంగా ముందుకు వెళ్లాలనే అంశాలను వివరించారు. బూత్ పరిధిలో గల ప్రతి ఒక్క ఓటరును నేరుగా కలిసి జగనన్న ప్రభుత్వం వారికి చేసిన మేలును వివరించాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలన్నా, సంక్షేమం, అభివృద్ధి పథకాలు రానున్న రోజుల్లో కొనసాగించాలన్న ప్రతి ఒక్కరూ సీఎం జగనన్నకు మద్దతుగా నిలిచి ప్రజాప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు ఉమామహేశ్వరి, రణభేరి చిన్నంనాయుడు, నాయకులు సువ్వాడ శ్రీనివాసరావు, సనాపతి చంద్ర, ఐ.పోలినాయుడు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, గృహ సారథులు పాల్గొన్నారు.

వెంకటభైరిపురంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న సర్పంచ్

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది నిర్వహించారు. గ్రామంలోని రోగులకు వైద్యాధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ మరడ వెంకటరత్నం చేతుల మీదుగా జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సాలూరు సీహెచ్‌సీ వైద్యాధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తీళ్ల రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో వైభవంగా రథసప్తమి ఉత్సవాలు

సీతానగరం: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆలయాల్లో అర్చకుల ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ మేరకు లచ్చయ్యపేటలోని లక్ష్మీతిరుమల వెంకటేశ్వరస్వామి, సీతానగరంలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో వందలాది మంది భక్తులతో అర్చకులు సూర్య నమస్కారాలు, ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే గ్రామాల్లోని రామమందిరాల్లో రథసప్తమి పూజలు చేశారు. పెదంకలాంలో రాముల వారికి పూజలు నిర్వహించిన నిర్వాహకులు అనంతరం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.



లచ్చయ్యపేట లక్ష్మీతిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న పూజలు

ఏకాదశి పూజల్లో ఉప ముఖ్యమంత్రి దంపతులు



అభయ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర దంపతులు

సాలూరు: పట్టణంలో మంగళవారం భీష్మ ఏకాదశి సందర్భంగా రామా కాలనీలో గల అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఆయన సతీమణి రోజమ్మలు ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జేఏఎస్ వైద్య శిబిరంతో ప్రయోజనాలు



రోగుల రిజిస్ట్రేషన్స్‌ను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాములునాయుడు

సీతానగరం: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్-2) వైద్య శిబిరాల వల్ల ప్రజలకు బహుళ ప్రయోజనాలున్నాయని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్‌ఆర్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదభోగిలి ప్రాథమిక పాఠశాల ఆవరణలో పీహెచ్‌సీ డాక్టర్ పావని, సీహెచ్‌ఓ ఎస్వీ రమణల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వైద్యసేవలు పొందడానికి వీలుకాని వారికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా నిర్వహిస్తున్న వైద్యశిబిరంలో వివిధరకాల వైద్యపరీక్షలు నిర్వహించి ప్రత్యేక డాక్టర్లతో వ్యాధి నిర్ధారణ అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అంతకు ముందు వైద్య సేవల కోసం వచ్చిన రోగులకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి, వైద్య పరీక్షల విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రత్యేక డాక్టర్లు దుర్గాప్రసాద్, ఆప్తమాలజిస్ట్ రమేష్,స్థానిక సర్పంచ్ జె.తేరేజమ్మ, ఎంపీటీసీ ఎస్.గౌరి, బి.కుసుమ, పార్థసారథి, పంచాయతీ ఈఓ జె.వెంకటరావు,హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజసేవలోకి రావాలి



మాట్లాడుతున్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ డీసీఓ డి.పద్మజ

- ఏపీఎస్‌డబ్ల్యూఆర్ డీసీఓ పద్మజ

సీతానగరం: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలకు అనుగుణంగా నిష్ణాతులైన విద్యార్థులు విద్యావంతులై సమాజసేవలో భాగస్వాములు కావాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ డీసీఓ డి.పద్మజ పిలుపునిచ్చారు. ఈ మేరకు జోగింపేటలోని డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ సాంఘికసంక్షేమ గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ పి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విద్యార్థుల ఫేర్‌వెల్ పంక్షన్ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ఇస్తున్న అధిక ప్రాధాన్యాన్ని గుర్తించి విద్యార్థులు చదవాలని, ఉత్తీర్ణత శతశాతాన్ని తీసుకురావాలని కోరారు. త్వరలో జరగనున్న టెన్త్ పబ్లిక్, ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధనకు అధ్యాపక, ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ పి.ఈశ్వరరావు మాట్లాడుతూ త్వరలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు 60 మంది విద్యార్థులు హాజరవుతారని, శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి అవసరమైన విద్యాబోధన జరుగుతోందని తెలియజేశారు. ఫేర్‌వెల్ పంక్షన్‌లో పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన అతిథులకు కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు రాజారావు, మధుబాబు, బలరాం, వెంకటనాయుడు సహచర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: మండలంలోని ప్రజలకు సచివాలయాల్లో ఉద్యోగులు మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ ఎం ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన జోగింపేట సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి శాఖల వారీగా సర్వీస్ కమిషన్ ద్వారా ఉద్యోగులను నియమించిందన్నారు. గతంలో ప్రజలకు ఎటువంటి పనులు కావాలన్నా మండల కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రజల కష్టాలను చూసిన ప్రభుత్వం గ్రామాల్లోనే ప్రజలకు నిర్దేశించిన గడువులోగా పనులు జరగాలనే ఉద్దేశంతో సేవలందిస్తోందన్నారు. ఉద్యోగులు ప్రజలకు సేవలందించడానికి అందుబాటులో ఉండాలని సూచించారు. ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించడానికి అధికారుల సూచనలు తీసుకుని చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి మార్కులు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీపీఆర్‌ఓ లోచర్ల రమేష్

పార్వతీపురంటౌన్: విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చునని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, పాఠశాల ప్రత్యేకాధికారి లోచర్ల రమేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పదవ తరగతిలో మంచి మార్కులు సాధించేందుకు మెలకువలు నేర్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అత్యధిక మార్కులు సాధించి భవిష్యత్తులో మంచి స్థానానికి చేరుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. పది పరీక్షల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది పది పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.